ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

వ్యవసాయం తెల్వనోడు ఎన్నయినా మాట్లాడుతడు

వ్యవసాయం తెల్వనోడు ఎన్నో అబద్ధాలు మాట్లాడుతడు. రేవంత్‌రెడ్డికి వ్యవసాయం గురించి ఏం తెలుసని మూడు గంటల కరెంట్, 10హెచ్‌పీ మోటార్లు అంటున్నడు. క్షేత్రస్థాయికి వెళ్లి రైతులతో మాట్లాడితే తెలుస్తది. సేద్యానికి ఎన్ని గంటల కరెంట్ కావాలో.. ఎప్పుడెప్పుడు ఇస్తే బాగుంటుందో. మన వద్ద ఎక్కువగా 5 హెచ్‌పీ మోటర్లు వాడుతరు. 10హెచ్‌పీ మోటరు కావాలంటే లక్ష రూపాయలు అవుతుంది. ఈ డబ్బులు ఎవరిస్తారు. ఆయన ఏమైనా ఇస్తారా? మాట్లాడితే అర్థం ఉండాలి. పెద్ద మోటర్లు అయితే అందరూ ఒకేసారి మోటర్లను ఆన్ చేస్తే ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోతాయని కనీసం తెలియని వ్యక్తి రేవంత్‌రెడ్డి. వాళ్ల పాలనలో ఇప్పటికే ఆగమైనం. మళ్లీ వస్తే సర్వ నాశనం కావడం ఖాయం.

–జలగం గోపాల్, రైతు, ఏపూరు, ఆత్మకూర్.ఎస్ మండలం

3 గంటల కరెంటిస్తే మునుగుడే

10 హెచ్‌పీ మోటర్లు రైతులకు గుదిబండ

- ఉమ్మడి జిల్లాలో 3.68 లక్షల మంది రైతులపై రూ.3,680 కోట్ల భారం తప్పదు
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కామెంట్లపై మండిపడుతున్న రైతాంగం

సూర్యాపేట, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ) : ముఖ్యమంత్రి కేసీఆర్ 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తుంటే.. రైతాంగం సంతోషంగా ఉన్నది. సర్కారు సహకారంతో ఇప్పుడిప్పుడే పచ్చబడుతున్న రైతాంగంపై భారం మోపి ఆగం చేసేందుకు కాంగ్రెస్ కుట్రలు పన్నుతున్నది. ఈ క్రమంలో రైతులకు మూడు గంటల విద్యుత్ చాలు, 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని చెప్పిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై అన్నదాతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కరెంటు, నీళ్లతో పాటు వ్యవసాయంపై కనీస అవగాహన లేని కాంగ్రెస్‌పై కన్నెర్ర చేస్తున్నారు. కర్మ కాలి కాంగ్రెస్ వస్తే.. మళ్లీ 2014 ముందుకు వెళ్లినట్టేనని భావిస్తున్నారు. వాళ్లు చెప్పినట్లు చేస్తే ఒక్కో రైతుపై లక్ష రూపాయలకు పైనే భారం పడనుంది. సూర్యాపేట జిల్లాలో 1.47 లక్షలు, నల్లగొండలో 2.21 లక్షల మోటర్లు.. మొత్తం 3.68 లక్షల మోటర్లు ఉండగా వాటి స్థానంలో 10హెచ్‌పీ మోటర్లు మార్చాలంటే రూ.3,680 కోట్లు కావాల్సి ఉంటుంది. ఇలాంటి అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటామంటున్న కాంగ్రెస్ పార్టీని బురద పాలాల్లో బొంద పెట్టాల్సిందేనని రైతాంగం అంటున్నది.

10హెచ్‌పీ మోటర్లు కొనుగోలు చేయాలంటే ఒక్కో సబ్‌మెర్సిబుల్ మోటరుకు రూ.85 నుంచి రూ.95వేలు అవుతుంది. దీంతో పాటు రూ.30వేల నుంచి 50వేలతో పైపులు, కేబుల్ వైరు, ప్యానల్ బోర్డు, ఇన్‌స్టాలేషన్ ఇతరత్రా కలిపి మరో 25 వేల నుంచి 30 వేల రూపాయలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఒక్కో రైతు రూ.1.40 లక్షల నుంచి 1.75 లక్షల రూపాయలు అదనంగా భరించాల్సి ఉంటుంది. అసలు 10హెచ్‌పీ మోటర్లు వాడాలంటే వేల కోట్లు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన విద్యుత్ వ్యవస్థలో సమూల మార్పులు చేయాల్సి ఉంటుంది. ఇది ఎంత వరకు సాధ్యపడుతుందని మేధావులు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి నిర్ణయాలు రైతాంగానికి నష్టం చేకూర్చేది తప్ప.. మరోటి కాదని రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది.



కాంగ్రెసోళ్లను నమ్మితే చీకటి బతుకులే

కాంగ్రెసోళ్లను నమ్మితే మళ్లీ రైతుల బతుకులు చీకట్లే అయితయ్. రేవంత్‌రెడ్డికి వ్యవసాయం గురించి ఏం తెలుసని మూడు గంటలే చాలంటున్నడు. అట్లయితే గతంలో వారి పాలనలో పండుకున్న విధంగానే పొలాల వద్దనే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి వస్తుంది. సీఎం కేసీఆర్ నాయకత్వంలో వ్యవసాయానికి 24 గంటల కరెంటు ఉంటున్నది. అవసరమున్నప్పుడు పోయి నీళ్లు పెట్టుకుంటున్నం. దీంతో దిగుబడి కూడా మంచిగుంటున్నది. రైతులు మంచిగ బతుకుడు కాంగ్రెసోళ్లకు ఇష్టమున్నట్లు కనిపిస్తలేదు. మళ్లీ నట్టేట ముంచే పనులు చేస్తున్నరు. 10 హెచ్‌పీ మోటర్లు అంటున్నరు. అవి వాడితే బోర్లల్లో నీళ్లు సరిపోవు. అంతేకాకుండా అంత పెద్ద మోటర్లు కొనుక్కునే పరిస్థితి కూడా లేదు. ఖర్చు బాగా పెరుగుతుంది. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ వస్తే గతంలో మనం పడ్డ ఇబ్బందులు వస్తాయని గుర్తు చేసుకోవాలి.

– బుడిగే రోషయ్య, కల్లూరు, నేరేడుచర్ల మండలం

ఎవుసానికి 10హెచ్‌పీ మోటరు వాడుతరా?

ఎవుసం చేసేటోడు ఎవడైనా పది హెచ్‌పీ మోటరు వాడుతడా? తెలిసినోడైతే అసలు ఆ మాటే మాట్లాడడు. అది పనికిమాలిన మాట. రైతులు ఎవరికైనా బోర్లు, బావులు ఉంటయ్. వాటిల్లో ఐదు హెచ్‌పీల వరకు మోటర్లు వేసుకుంటరు. కానీ.. కాంగ్రెస్ నాయకులు కల్లబొల్లి కబుర్లు చెబుతున్నరు. రైతులకు మూడు గంటల కరెంట్ ఇస్తం అంటే సరిపోద్దా? ఎవుసం చేసిన మొఖాలైతే వారికి రైతుల బాధలు తెలుస్తుండె. యాడనో కూసోని నోటికొచ్చినట్టు మాట్లాడితే సరిపోతదా. బోర్లు, బావుల మీద పది హెచ్‌పీ మోటర్లు వేస్తే నీళ్లు వెంటనే అయిపోయి బంద్ చెయ్యాలే. లేకుంటే మోటర్లు కాలిపోతయ్. దానికోసం రైతులు అన్ని పనులు వదిలేసుకుని అక్కడ్నే కూసోని మోటర్లు ఎయ్యాలె.. బంద్ చేయ్యాలె. అట్లనే అప్పుడున్న మోటర్లు, స్టార్టర్లు, పైపులు ఏమీ పనికి రాకుండా పోతయ్. అన్నీ కొత్తవి తేవాలె. మనకాడ ఉన్న టాన్స్‌ఫారాలు కూడా పనికి రావు. అయ్యి కూడా పెద్దవి ఎయ్యాలె. ఇయ్యన్ని కొత్తగా తేవాలంటే పైసలు ఎవరిస్తరు. ఇప్పుడున్న ప్రభుత్వం 24 గంటల పాటు నాణ్యమైన కరెంట్ ఇస్తుంది. దాంతోనే బోర్లు, బావుల్లో ఉన్న నీటితో పొలాలు మంచిగా పండించుకుంటున్నం. ఇదంతా రైతులకు అనుభవమే. మాయమాటలు జెప్పి కాంగ్రెస్ అధికారంలోకి రావాలని చూస్తుంది. కానీ.. రైతులందరూ ఎవరికి వేస్తే మేలు జరుగుతుందో తెలుసుకుని ఓటియ్యాలె.

– గందె వెంకటేశ్వర్లు, రాయినిగూడెం, గరిడేపల్లి మండలం

3గంటల కరెంట్‌తో వ్యవసాయం చేయలేం

ఇప్పుడు 24గంటల పాటు నాణ్యమైన కరెంట్ ఇస్తున్నారు. 5హెచ్‌పీ మోటర్లు పెట్టుకొని పంటలు మంచిగా పండించుకుంటున్నాం. మూడు గంటల కరెంట్‌తో వ్యవసాయం చేయలేం. 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకొని మూడు గంటల కరెంట్‌తో ఒకేసారి మోటర్లు వేస్తే ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతాయి. ఏదైనా సమస్య వచ్చి బయటకు తీయాలంటే కూడా ఇబ్బందే. 10హెచ్‌పీ మోటరు ఎవరూ పెట్టుకోవడం లేదు. అది కొనాలంటే లక్ష రూపాయలు కావాలి. ఎక్కువ నడిస్తే బోరు బావిలోనే కూలిపోతది. అప్పుడు రైతులకు ఇంకా కష్టం అవుతుంది. కేసీఆర్ సార్ ఇస్తున్న 24గంటల ఉచిత కరెంట్ ఉంటేనే మంచిది.

– పులిచర్ల జగన్, రైతు, అర్వపల్లి

10హెచ్‌పీ మోటరు ఇంతవరకు చూడలేదు

మా తాతల కాలం నుంచి వ్యవసాయం చూసుకుంటూ వస్తున్నాం. ఇంత వరకు ఎక్కడా 10హెచ్‌పీ మోటరు వాడలేదు. చూడలేదు కూడా. ప్రస్తుతం ఎక్కువగా 5హెచ్‌పీ మోటర్లు వాడుతున్నారు. 10హెచ్‌పీ మోటరు బోరులో పట్టదు. దానికి సరిపడా నీళ్లు అందించలేదు. అంతటి సామర్థ్యం ఉన్న మోటర్లు మన తెలంగాణ రైతులు ఎక్కడా వాడరు. కాంగ్రెస్ నాయకులు వ్యవసాయం మీద అనుభవం లేకుండా నోటికి ఏదొస్తే అదే మాట్లాడుతుండ్రు. రేవంత్‌రెడ్డి మాట్లాడే విధానం చూస్తే ఆయనకు వ్యవసాయం మీద అవగాహన లేనట్టు అర్థమవుతుంది. 10హెచ్‌పీ వాడితే నీళ్లు అందక మోటర్లు కాలిపోతాయి. వ్యవసాయం విషయంలో కాంగ్రెస్ పార్టీ రైతులను తప్పుదోవ పట్టించి అధికారంలోకి రావడానికి ప్రయత్నించడం కరెక్ట్ కాదు.

– కొండపల్లి మధుసూదన్‌రెడ్డి, మామిండ్లమడవ, మద్దిరాల మండలం

10 హెచ్‌పీ మోటర్లు ఎవరిస్తరు..

రైతులు 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకుని పొలానికి నీళ్లు పెట్టుకోవాలని రేవంత్‌రెడ్డి అంటుండు. అంత పెద్ద మోటరు పొలంకాడ ఎవరన్న పెట్టుకుంటరా? పెద్ద పెద్ద కంపెనీల్లో పెట్టుకునే మోటర్లు రైతులకెందుకు. అయినా దాన్ని కొనడానికి డబ్బులు ఎవరిస్తరు.. కాంగ్రెసోళ్లేమైనా ఇస్తరా? మతి లేకుండా మాట్లాడుతున్నరు. నాకు రెండెకరాల పొలం ఉంది. దాంట్లో 3హెచ్‌పీ మోటరు వాడుతున్నాం. 24 గంటల కరెంట్‌తో ఏ కష్టం లేకుండా ఎప్పుడంటే అప్పుడు మోటరు ఆన్ చేసుకుంటున్నం. కరెంట్ కోసం ఆందోళన చెందాల్సిన పనిలేదు. పొలానికి నీళ్లు మంచిగా పారుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావద్దు.. 3 గంటల కరెంటూ వద్దు. 10 హెచ్‌పీ మోటర్లు అసలే వద్దు. గత కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోసం పడ్డ గోస చాలు. మళ్లీ ఆ తిప్పలు పడలేం. సీఎం కేసీఆర్ పాలనలో చాలా మంచిగా బతుకుతున్నం. మళ్లీ సారే గెలువాలి.

– మొండికత్తి లింగయ్య, దురాజ్‌పల్లి, చివ్వెంల మండలం

కాంగ్రెస్ పాలనలో కంటి నిండి నిద్ర కూడా లేదు

కాంగ్రెస్ పాలనలో కరెంట్ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఏనాడూ కంటి నిండా నిద్ర కూడా పోలేదు. కరెంట్ కోసం రాత్రంతా జాగారం చేసేటోళ్లం. రాత్రిళ్లు పొలాల దగ్గరకు పోతే పాములు, తేళ్లు కరిచేవి. అడవి పందులు ఎంబడి పడేటివి. గతంలో కరెంట్ షాకులతో ఎందరో రైతులు చనిపోయిండ్రు. గా బాధలు మళ్లీ రావద్దు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ బాధలు తీరినయి. 24 గంటల ఫ్రీ కరెంట్ ఇస్తున్నరు. ఎప్పుడంటే అప్పుడు పోయి పొలానికి నీళ్లు పెట్టుకుంటున్నం. రాత్రి పూట బావుల కాడ పండే బాధలు పోయినయి. గిప్పుడు సాగుకు 24 గంటలు ఎందుకు మూడు గంటలు చాలదా.. అని కాంగ్రెస్ నాయకులు అంటున్నరు. ఎట్ల సరిపోతది. వాళ్లు ఎప్పుడన్న ఎవుసం చేసినా.. మా రైతులను మళ్లీ నరకంల పడేస్తరా? మేం మోసపోం. 24 గంటల కరెంట్ ఇచ్చే బీఆర్ఎస్సే మాకు కావాలె.

– బద్దం వెంకట్‌రెడ్డి, రైతు, నూతనకల్

ధరణి లేకుంటే దోపిడే..

మళ్లీ ఎనకటి కాలం వస్తది

- పైరవీకారులు రాజ్యమేలుతరు
- రైతులను కాంగ్రెస్ ముంచాలని చూస్తున్నది
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతాంగం

భూ సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌తో భూములకు సంబంధించిన కొట్లాటలు, కేసులకు చెక్ పడింది. ఎవరి భూమి వారి పేరుపై నిక్షిప్తమై ఉండడంతో రైతులంతా భరోసాతో ఉన్నారు. రైతుబంధు సాయాన్ని సులభంగా రైతుల ఖాతాల్లో వేయగలుగుతున్నారు. అలాంటి పారదర్శక పోర్టల్‌ను తాము అధికారంలోకి వస్తే రద్దు చేసి భూమాత పోర్టల్ తీసుకొచ్చి మళ్లీ పాత పద్ధతే అమలు చేస్తామని కాంగ్రెస్ నాయకులు చెప్పడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ పాత రోజులే వస్తాయని, పట్వారీల చుట్టూ తిరగాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు.

పట్వారీ వ్యవస్థ వస్తే రైతులకు అరిగోసే..

మల్ల పట్వారీ వ్యవస్థ వస్తే రైతులకు అరిగోస తప్పదు. రైతుల భూముల బాధలు పోవాలనే ముఖ్యమంత్రి కేసీఆర్ పట్వారీ వ్యవస్థ తీసేసి ధరణి తీసుకొచ్చిండు. మా భూముల సమస్యలు, కొట్లాటలు పోయి హాయిగా ఉన్నం. మల్ల కాంగ్రెసోళ్లు ధరణి తీసేసి పట్వారీ వ్యవస్థ తీసుకొస్తమంటున్నరు. పాత పద్ధతి వస్తే రైతుల సమస్యలు ఎనకటి లాగే ఉంటాయి. ధరణి వచ్చినంక రైతులకు మంచిగా రైతు బంధు పెట్టుబడి సాయం అందుతుంది. రైతు చనిపోతే 5లక్షల రూపాయల రైతు బీమా వస్తుంది. రైతుల బతుకులు బాగుపడ్డయి. మల్ల పట్వారీ వ్యవస్థ వస్తే రైతులు చెప్పులరిగేలా అధికారులు, ఆఫీసుల చుట్టూ తిరగాలి. లంచాలు లేనిదే పని జరుగదు. పట్వారి వ్యవస్థ రాకుండా ఉండాలంటే రైతులంతా ఒక్కట్టై కేసీఆర్‌నే గెలిపించుకోవాలి. లేకుంటే రైతుల బతుకు ఆగమే.

– లావుడియా బాలూనాయక్, రైతు, మొండిచింత తండా, తిరుమలగిరి మండలం

కాంగ్రెస్ పాలనలో రైతులకు మేలు జరిగింది లేదు

ఒకప్పుడు పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయి ఏడ్చుకుంటూ వ్యవసాయం చేసిన రైతులు సీఎం కేసీఆర్ పాలనలో సంతోషంగా ఉన్నరు. ఎలాగైనా అధికారంలోకి రావాలనే ఆలోచనతో కాంగ్రెసోళ్లు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నరు. వారికి రైతులకు మేలు చేయాలనే దానికంటే పదవులపైనే యావ ఎక్కువ. అందుకే కౌలుదారు చట్టం తెస్తామంటున్నరు. ఇప్పటి వరకు నమ్మకం మీద పొలాలు కౌలుకు చేసిన రైతులు.. తర్వాత భూ యజమానులను ఒప్పందం రాసియ్యమంటరు. అలా రాసిస్తే దానిని అడ్డం పెట్టుకుని కౌలు రైతులు భూమికి అడ్డం తిరిగే అవకాశాలు ఉంటాయి. అలాగే కౌలు కూడా సక్రమంగా ఇస్తారో, ఇవ్వరోననే అనుమానంతో భూ యజమానులు తమ భూములను కౌలుకు ఇవ్వకుండా జాగ్రత్త పడుతారు. దీంతో భూమి లేని వారికి కౌలుకు పొలాలు దొరికే పరిస్థితి ఉండదు. ఇప్పటి వరకు భూ యజమానులు, కౌలు రైతులు ఒకరి మీద ఒకరు నమ్మకాలతో పొలాలు చేసుకుంటున్నరు. ఇప్పుడు కాంగ్రెస్ వాళ్లు ఇద్దరి మధ్య చిచ్చుపెట్టి కూర్చున్నరు. ఇంతటి ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కోవాల్సిన అవసరం లేదు. కాబట్టి రైతులు ఎవరిని గెలిపిస్తే మేలు జరుగుతుందో ఆలోచించి ఓటియ్యాలి.

– ఎల్గూరి సత్యనారాయణరెడ్డి, రైతు, కల్మలచెర్వు, గరిడేపల్లి మండలం

ధరణి తీసేస్తే భూములు ఆగమాగం

రాష్ట్రంలోని భూముల వివరాలు ఆన్‌లైన్‌లో పకడ్బందీగా ఉండే ధరణి పోర్టల్‌ను తీసేస్తే రైతుల పేర్ల మీద ఉన్న భూముల వివరాలు ఆగమాగం అవుతాయి. ధరణిలో భూమి ఒకరి పేరు మీద నుంచి మరొకరికి మారాలంటే పట్టా కలిగిన రైతు తాసీల్దార్ కార్యాలయంలో వేలి ముద్ర వేయాలి. ధరణితో ఎటువంటి మోసాలు జరుగకుండా ఉన్నది. రైతులకు రైతుబీమా, రైతు బంధు కచ్చితంగా వస్తుందంటే అది ధరణి పుణ్యమే. కాంగ్రెస్ వస్తే కౌలు రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామంటున్నారు. అదే జరిగితే కొంతకాలం తరువాత అసలు రైతుకు, కౌలుదారుకు మధ్య వివాదాలు జరిగి భూములు తారుమారు అవుతాయి. పాత రోజులు గర్తుకొస్తేనే భయం వేస్తుంది. ఈ కాంగ్రెస్‌ను నమ్ముకుంటే మన భూములు అంతే సంగతులు.

– బెల్లంకొండ జగన్నాథం, రైతు, చిలుకూరు మండలం

కాంగ్రెస్ సర్కారు వస్తే రైతులకు తిప్పలు తప్పవు

ధరణి పోర్టల్ వచ్చిన తరువాత రైతులకు గోస తగ్గింది. కాంగ్రెస్ వాళ్లు ధరణి తీసేస్తామంటున్నరు. దాన్ని తొలగిస్తే మళ్లీ పాత రోజులు వస్తాయి. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ధరణితో నేడు రైతులంతా దర్జాగా ఉన్నారు. రైతుల సంతోషాన్ని చూసి ఓర్వలేని కాంగ్రెస్ పార్టీ.. రెవెన్యూ రికార్డులు, కౌలుదారు, అనుభవదారు కాలాలు పెడుతామని అంటున్నది. కాంగ్రెసోళ్లు భూ మాత పోర్టల్ తెస్తే భూ సమస్యలు పెరిగి గ్రామాల్లో భూమిపై రైతులు హక్కు కోల్పోయే ప్రమాదం ఉంది. ఎనుకటి కాలాన అధికారులు చుట్టూ చెప్పులరిగేలా తిరిగి లంచాలు ఇస్తేనే పనులు పూర్తయ్యేవి. రిజిస్ట్రేషన్ అనంతరం వీఆర్‌ఓకు డాక్యుమెంట్స్ ఇచ్చి మ్యుటేషన్ చేసి పాసు పుస్తకాలు ఇవ్వమంటే నెలల తరబడి, కొందరైతే ఏండ్ల తరబడి తిప్పించుకునేవారు. నేడు ధరణితో పైసా ఖర్చు లేకుండా, దళారుల ప్రమేయం లేకుండా ఒక్క రోజులోనే భూముల పట్టాలవుతున్నాయి. ధరణిని కాపాడుకునేందుకు ఓట్ల రూపంలో కాంగ్రెసోళ్లను రైతాంగముతా తరిమివేస్తారు. తగిన గుణపాఠం చెప్పాలి. బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తేనే మరింత మేలు జరుగుతుంది.

– ధరావత్ రాజు, నల్సింహులగూడెం, నాగారం మండలం